క్లుప్తంగా

యూరియా కోసం పాట్లు



తిమ్మాపురం పీఏసీఎస్ వద్ద యూరియా కోసం క్యూలో నిల్చున్న రైతులు

అర్వపల్లి : యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని తిమ్మాపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి శుక్రవారం 540 బస్తాల యూరియా రాగా రైతులు క్యూ కట్టారు. కేవలం ముందు క్యూలో ఉన్న రైతులకు మాత్రమే యూరియా దొరికింది. ఇంకా అనేక మంది రైతులకు యూరియా దొరకక వెనుదిరిగిపోయారు. యూరియా కొరతను తీర్చాలని అన్నదాతలు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

రైతులకు అందుబాటులో యూరియా

ఆత్మకూర్(ఎస్) : వేసవి సాగుకు రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉన్నదని, రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని మండల వ్యవసాయ అధికారి దంతాల దివ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఏపూరు, నెమ్మికల్ గ్రామాల్లోని పీఏసీఎస్ కేంద్రాలలో యూరియా పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఏపూరు కేంద్రానికి 1213 బ్యాగులు, నెమ్మికల్ కేంద్రానికి 560 బ్యాగులు వచ్చాయని, రైతుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని మరిన్ని యూరియా బ్యాగులు తెప్పించడానికి అధికారులకు నివేదిక పంపామన్నారు.

ఘనంగా టైలర్స్ డే



విలియం హోవే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టైలర్లు

తిరుమలగిరి : విలియం హోవే జయంతిని పురస్కరించుకొని టైలర్స్ డే మేరా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తిరుమలగిరి ఎక్స్ రోడ్‌లో టైలర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విలియం హోవే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడారు. దర్జీలకు ఉచిత కరెంటు, 50 సంవత్సరాలు నిండిన వారికి పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దర్జీ సంఘం తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ అధ్యక్షుడు రామగిరి సోమేష్, తిరుమలగిరి మండల అధ్యక్షుడు గూడూరు వెంకన్న, గౌరవ అధ్యక్షుడు రామగిరి ఉపేందర్, వాడపల్లి వెంకటేశ్వర్లు, కీర్తి సీతారాములు, కొండ సోమయ్య, గూడూరు కృష్ణ, మాడిశెట్టి అశోక్, సంఘ విజయ్, వి.శ్రీనివాసులు, జి.కార్తీక్, కె.సుమన్, జి.వెంకటేష్, జి.సోమన్న తదితరులు పాల్గొన్నారు.

నీటిని విడుదల చేయాలి

మద్దిరాల : రాష్ట్ర ప్రభుత్వం ఎస్సారెస్పీ నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోట గోపి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు దీకొండ ఉపేందర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వారబందీ పద్ధతిలో వచ్చే నీళ్లు పంట పొలాలకు సరిపోవడం లేదన్నారు. ఎండలకు భూగర్భ నీటిశాతం తగ్గిపోయి బావులు, బోర్లు ఎండిపోతున్నాయని తెలిపారు. వెంటనే ఎస్సారెస్పీ జలాలను వదిలి ఎండిపోతున్న పంట పొలాలను తడపాలని అన్నారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి పోలోజు సైదులు, నాయకులు కల్లెపల్లి భాస్కర్, దీకొండ రంగయ్య, బద్దం మల్లారెడ్డి, శిధిరాల నారాయణ, బ్రహ్మం, మోష, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్లు, పెన్నుల పంపిణీ



కేజీబీవీ విద్యార్థులకు పరీక్షప్యాడ్లను అందజేస్తున్న పసుల అశోక్‌యాదవ్

మద్దిరాల : మండల కేంద్రంలోని కస్తూరిబాగాంధీ గురుకుల పాఠశాలలో ఇంటర్ చదువుతున్న 70 మంది విద్యార్థులకు అశోక ఫౌండేషన్ అధ్యక్షుడు పసుల అశోక్ యాదవ్ పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం పరీక్ష ప్యాడ్లు, పెన్సిళ్లు, పెన్నులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్‌ఓ తేజశ్రీ, ఫౌండేషన్ సభ్యులు పులిగిల్ల లింగయ్య, మోహన్‌నాయక్, పులిగిల్ల రాజు, మరికంటి అశోక్, ఉపాధ్యాయులు సరిత, సాహెరా, రాజేశ్వరి, ధనలక్ష్మి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

తిరుమలగిరి : తిరుమలగిరి మండల పంచాయతీ కార్యదర్శుల నూతన కమిటీని శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల పంచాయతీ అధికారి అధ్యక్షతన ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా నలబోలు నాగలక్ష్మి, ఉపాధ్యక్షులుగా పందిరి మధుకర్, జనరల్ సెక్రటరీగా పి.కిరణ్, ట్రెజరర్‌గా దార సరిత, మీడియా కన్వీనర్‌గా మహ్మద్ ఇర్ఫాన్‌తోపాటు పలువురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి

- పెన్‌పహాడ్ మండలంలో పెరుగుతున్న ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం
- ఇప్పటివరకు 274ఎకరాల్లో సాగు



ఆయిల్‌పామ్‌లో అంతర పంటగా వేసిన మిర్చి



పసునూర్‌లో ఆయిల్‌పామ్ పంటను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి ప్రమిత

పెన్‌పహాడ్ : వ్యవసాయ రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా రైతులు ముందుచూపుతో పంటలను సాగు చేస్తున్నారు. రైతులు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారిస్తున్నారు. వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగుతో రైతులు ఆర్థికంగా బలపడాలని ప్రభుత్వం పేర్కొంటుండటం, వ్యవసాయ అధికారులు అవగాహన కల్పిస్తుండడంతో మండల రైతులు ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. పెన్‌పహాడ్ మండల పరిధిలోని పొట్లపహాడ్, సింగారెడ్డిపాలెం, పెన్‌పహాడ్, మాచారం, లింగాల, చెట్లముకుందాపురం, భక్తాళాపురం, చీదెళ్ల గ్రామాల్లో 274 ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలను నాటారు.

సబ్సిడీపై మొక్కలు..

ఆయిల్‌పామ్ మొక్క అసలు ధర రూ.193కాగా ప్రభుత్వం అందించే సబ్సిడీ పోను రైతులు రూ.20మాత్రమే చెల్లించాలి. అయితే ఒక ఎకరాకు 57మొక్కలు అవసరం ఉండగా రైతు రూ.1140చెల్లిస్తే ప్రభుత్వం రూ.9861 చెల్లిస్తుంది. ఆయిల్‌పామ్ మొక్కలు నాటిన నుంచి మొదటి నాలుగేళ్ల వరకు ఎకరాకు రూ. 4200 చొప్పున ప్రభుత్వం మొక్కల సంరక్షణకు సాయం అందిస్తుంది. ఆయిల్‌పామ్ సాగులో డ్రిప్ ఏర్పాటుకు సబ్సిడీ ఇస్తుంది. ఎస్సీ, ఎస్టీలకు 100శాతం సబ్సిడీపై, మిగతా రైతులకు 90శాతం సబ్సిడీపై డ్రిప్‌లను అందజేయనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

ఆయిల్‌పామ్ సాగులో 30 ఏళ్లపాటు దిగుబడి..

ఆయిల్‌పామ్ మొక్కలు నాటిన తర్వాత 4వ సంవత్సరం నుంచి పంట కాతకు వస్తుంది. 30ఏళ్ల వరకు దిగుబడి వస్తుంది. 4వ ఏటా 6 నుంచి 7 టన్నుల వరకు దిగుబడి రానుంది. ఏడాదికి దాదాపుగా 14టన్నుల దిగుబడి వస్తుందని ఒక టన్నుకు ధర రూ. 20400కాగా.. పెట్టుబడి పోను ఏడాదికి రూ.2లక్షలకు పైగా ఆదాయం వస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. ఆయిల్‌పామ్ సాగులో అంతర పంటలుగా పత్తి, మిర్చి, వేరుశనగ, పెసర, కూరగాయలు తదితర పంటలను సాగు చేసుకుంటే రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుంది.

రైతులకు మేలు



రైతులు వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుంది. రైతులు ఆయిల్‌పామ్ పంటను సాగు చేస్తే ఆర్థికంగా బలోపేతం కావచ్చు.

– తీగల నాగయ్య, ఉద్యానవన అధికారి

ఆయిల్‌పామ్‌తో లాభాలు

నాగారం : నీటి వసతి ఉన్న రైతులు ఆయిల్‌పామ్ తోటలను సాగు చేసి అధిక లాభాలు పొందాలని తుంగతుర్తి డివిజన్ ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి వి. ప్రమిత అన్నారు. శుక్రవారం పసునూర్‌లో సాగవుతున్న ఆయిల్‌పామ్ తోటలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జిల్లాలో తుంగతుర్తి డివిజన్‌లోనే అధిక విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ తోటలు సాగు అవుతున్నాయని చెప్పారు. రైతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని, ఆయిల్‌పామ్ తోటలను సాగుచేసి అధిక లాభాలు పొందాలని సూచించారు. ఆయిల్‌పామ్ పంటకు కూలీల ఖర్చు తక్కువ అని, కోతుల, దొంగల బెడద ఉండదని అన్నారు. ఆయిల్‌పామ్ పంటను ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కంపెనీ వారే విక్రయిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పతంజలి ఆయిల్ పామ్ జూనియర్ మేనేజర్ వి.శశికుమార్, ఫీల్డ్ ఆఫీసర్ పి.అశోక్, పతంజలి క్షేత్ర సహాయకులు రంగు ముత్యంరాజు, రైతులు పాల్గొన్నారు.

మైనింగ్ పనులు నిలిపివేయాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న కమిటీ సభ్యులు

భానుపురి : తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో సర్వే నంబర్ 98లోని పూరెళ్లగుట్టపై పటేల్ గ్రానైట్స్ చేపడుతున్న మైనింగ్ పనులను వెంటనే నిలిపివేయాలని తొండ గ్రామ అభ్యుదయ కమిటీ అధ్యక్షుడు నీరటి ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం గ్రామ అభ్యుదయ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా మైనింగ్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. 2023లోనే పూరెళ్లగుట్టపై పనులు చేసేందుకు పటేల్ గ్రానైట్స్ నిర్వాహకులు వస్తే అడ్డుకుని, అప్పటి కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో పనులు నిలిపివేశారని గుర్తు చేశారు. ఈ గుట్టకు ఆనుకుని రైతువేదిక, క్రీడాప్రాంగణం, డంపింగ్ యార్డు, మైసమ్మ గుడి ఉన్నాయని, ఇటీవల రూ.330 కోట్లతో ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలకు సైతం శంకుస్థాపన చేశారని చెప్పారు. ఇప్పటికైనా ఈ ప్రాంతంలో చేపట్టే మైనింగ్ పనులను అడ్డుకోవాలని, మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభ్యుదయ కమిటీ సభ్యులు పోరెండ్ల లక్ష్మయ్య, ఏసిరెడ్డి, పల్లెర్ల భిక్షం, చింతకింది సోమనారాయణ, గుమ్మడివెల్లి దేవచిత్తం, గొడుగు రమేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి



రమేష్‌రెడ్డికి సమస్యలను వివరిస్తున్న శ్రీనివాస్

భానుపురి : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అయ్యేలా చొరవ చూపాలని తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుంకరి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లాకేంద్రంలో తెలంగాణ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి నివాసంలో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ప్రకటన చేసినా.. నేటికీ అమలులోకి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ యాజమాన్యం ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోకుండా అడ్డుకుంటుందని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల వేతన సవరణ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని కోరారు. గత 13 ఏళ్లుగా ఆర్టీసీలో ఉన్న ఖాళీలను భర్తీ చేయని కారణంగా ఉద్యోగులపై అధిక పనిభారం పడుతోందని చెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ మజ్దూర్ యూనియన్ సభ్యులు మాచర్ల భాస్కర్, ఏకాంబరం, నాయని విద్యాసాగర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు చేయూతనందించాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీవాణి



మాట్లాడుతున్న శ్రీవాణి

చివ్వెంల : అనాథలకు ప్రతి ఒక్కరూ చేయూతనందించాలని సూర్యాపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.శ్రీవాణి అన్నారు. శుక్రవారం కుడకుడ గ్రామ శివారులోని శ్రీ అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్ట్ అనాథ వృద్ధుల, వికలాంగుల ఆశ్రమాన్ని సందర్శించి మాట్లాడారు. ఆశ్రమంలో నీటి సమస్య తీర్చాలని, ఆశ్రమానికి వెళ్లేందుకు రోడ్డు సమస్య పరిష్కరించాలని, వైద్య సదుపాయం కల్పించాలని నిర్వాహకులు ఆమె దృష్టికి తీసుకురాగా.. సమస్యల పరిష్కారం కోసం తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దపుకు మల్లయ్య, డిఫెన్స్ కౌన్సిల్స్ బొల్లెద్దు వెంకటరత్నం, బట్టిపల్లి ప్రవీణ్ కుమార్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన

ఆత్మకూర్(ఎస్) : సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని హెడ్ కానిస్టేబుల్ గునుగుంట్ల గురులింగం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల బాలుర పాఠశాలలో సైబర్ నేరాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ యాప్‌లకు విద్యార్థులు దూరంగా ఉండాలని అన్నారు. ఫేస్‌బుక్, ట్విట్టర్ లాంటి ఆన్‌లైన్ వేదికలను దుర్వినియోగం చేస్తూ నేరాలకు పాల్పడే వారికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ కిత నరేష్, మహేందర్, మధుసూదన్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పెన్‌పహాడ్ : అనంతారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల నాయకుడు పల్లెపంగు మదన్ భార్య పల్లెపంగు రాణి ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. శుక్రవారం మాజీ ఎంపీపీ నెమ్మాది భిక్షం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఉపాధ్యాయుడికి ఉద్యోగ విరమణ సన్మానం



దుర్గా ప్రసాద్ రెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఆత్మకూర్(ఎస్) : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నాగిరెడ్డి దుర్గా ప్రసాద్ రెడ్డి ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమాన్ని శుక్రవారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ రెడ్డి దంపతులను పాఠశాల సిబ్బంది, వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు గజమాల, శాలువాలు, పూలదండలు, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ధారాసింగ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రవణ్ కుమార్, ఉపాధ్యాయులు ఊర్మిళ, మల్లారెడ్డి, సుదర్శన్ రెడ్డి, చంద్రశేఖర్, అన్నపూర్ణ చారి, రమేష్, శిరీష, రామచంద్రయ్య, మల్లేశ్వరి, యాదమ్మ, రఘు, శ్రీదేవి, అనిత తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి తోడ్పాటు..

ఆత్మకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన నాగిరెడ్డి దుర్గాప్రసాద్ రెడ్డి ఇటీవల ఆ పాఠశాలకు తనవంతుగా సహాయం చేయాలని భావించారు. చాలా కాలంగా రంగులు వేయకుండా బోసిపోయిన పాఠశాలకు లక్ష రూపాయల సొంత ఖర్చులతో రంగులు వేయించారు. అలాగే పక్కనే ఉన్న ఎమ్మార్సీ భవనానికి సైతం రంగులు వేయించి నూతన శోభను తీసుకొచ్చారు.

నిరుపేద విద్యార్థులకు సహకారం..

ప్రభుత్వ ఉపాధ్యాయుడు నాగిరెడ్డి సుదర్శన్ రెడ్డి తాను ఎక్కడ పనిచేసినా ఆ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించడం కోసం తపన పడుతుంటారు. ఇందు కోసం తన తోటి ఉపాధ్యాయులు, మిత్రుల సహకారంతో ముందుకు సాగుతుంటారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులైన క్రీడా సామగ్రి, బెంచీలు, ఫ్యాన్లు, బీరువాలు సమకూర్చడంలో తన మిత్రుల సహకారంతో కృషి చేశారు. అలాగే నిరుపేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పరీక్షల సమయంలో పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, మెటీరియల్ అందించడంలో ముందున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అవగాహన



లక్ష్మాపురంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ మారయ్య

నాగారం : పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన మండల పరిధిలోని లక్ష్మాపురం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ఎంపీడీఓ కె.మారయ్య శుక్రవారం లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం లబ్ధిదారులు ఇంటి నిర్మాణం చేపట్టాలన్నారు. మొదట విడతలో ముగ్గు పోసుకొని బేస్మెంట్ నిర్మాణం పూర్తయిన తరువాత రూ.1లక్ష, స్లాబ్ లెవల్ గోడల నిర్మాణానికి రూ.1లక్ష, స్లాబ్‌కు రూ.2లక్షలు, ఇల్లు మొత్తం పూర్తయిన తరువాత రూ.1లక్ష సాయంగా మొత్తం రూ.5లక్షలను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ప్రభుత్వ సూచనలు పాటిస్తూ ఇళ్ల నిర్మాణాలు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి చందన, కార్యదర్శి గోపి, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కమిటీ సభ్యులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా శ్రామిక దినోత్సవం నిర్వహించాలి



మాట్లాడుతున్న కంచర్ల నర్సమ్మ

భానుపురి : మార్చి 1 నుంచి 8వ తేదీ వరకు అంతర్జాతీయ మహిళా శ్రామిక పోరాట దినోత్సవాన్ని గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించాలని పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల నర్సమ్మ అన్నారు. శుక్రవారం సూర్యాపేట చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన పీఓడబ్ల్యూ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. హైదరాబాద్ కేంద్రంగా 72వ ప్రపంచ అందాల పోటీలు నిర్వహించడాన్ని అడ్డుకుంటామన్నారు. కులాంతర, మతాంతర వివాహాలు చేసుకుంటున్న వారిపై, ముఖ్యంగా దళితులపై దాడులు, పరువు హత్యలు జరుగుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు రామలింగక్క, సూర్యాపేట జిల్లా కమిటీ సభ్యులు సైదమ్మ, సామ ఉపేంద్ర, జి.కావ్య, మంగమ్మ, జయసుధ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఆత్మకూర్ (ఎస్) : ఆత్మకూరు మండల పరిధిలోని శెట్టిగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా, ప్రభుత్వ అధికారులుగా, ప్రజాప్రతినిధులుగా అభినయించి అబ్బురపరిచారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు క్రాంతి, ఉపాధ్యాయులు రాజు, ఉమామహేందర్, అఫీయుద్దీన్, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

3నుంచి ఉచిత యోగా, ధ్యానోత్సవాలు



ఫ్లెక్సీలను ప్రదర్శిస్తున్న నిర్వాహకులు

అర్వపల్లి : అర్వపల్లిలో హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, శ్రీరామచంద్ర మిషన్‌ల ఆధ్వర్యంలో మార్చి 3 నుంచి జరిగే ఉచిత యోగా, ధ్యానోత్సవాల విజయవంతానికై నిర్వాహకులు శుక్రవారం ఫ్లెక్సీల ప్రదర్శన నిర్వహించారు. మూడు రోజుల పాటు ఈ శిక్షణా కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. అర్వపల్లిలో ప్రతి ఆదివారం ధ్యాన కార్యక్రమం జరుగుతుందని, ఇందు కోసం ప్రత్యేకంగా ధ్యాన కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సూర్యాపేట హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ సెంటర్ ఇన్‌చార్జ్ ఎస్.గోవర్ధనగిరి, ప్రశిక్షకులు ముసునూరి వెంకటరంగారావు, నూకల ఉపేందర్, అభ్యాసకులు శేఖర్, వెంకటేష్, దడిపల్లి వెంకట్, మేకల సత్యనారాయణ, మనుబోతుల వీరయ్య, వనం రమేష్, డి.సతీష్ పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ హెచ్ఎంకు సన్మానం

నాగారం : ఫణిగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడిగా ఎస్‌డీ.మక్సూద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇక్కడ జీహెచ్ఎంగా పనిచేస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి లాంగ్‌లీవ్‌పై వెళ్లడంతో ఆయన స్థానంలో ఎస్‌డీ మక్సూద్ ఇన్‌చార్జ్ హెచ్ఎంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం నూతన ఇన్‌చార్జ్ హెచ్ఎంగా బాధ్యతలు చేపట్టిన మక్సూద్‌ను శాలువాలతో, పూలమాలలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.రమేష్, ఎస్‌కె.పాష, రాజేశ్వరి, మంజుల, భాస్కర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



మద్దిరాల : ముకుందాపురం పాఠశాలలో సైన్స్ ప్రయోగాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



నాగారం : వర్ధమానుకోట జెడ్పీహెచ్ఎస్‌లో సైన్స్ ప్రయోగాలు చేస్తున్న విద్యార్థులు



సూర్యాపేటటౌన్ : తయారు చేసిన ప్రయోగాత్మక వస్తువులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట పట్టణంలోని విద్యానగర్‌లో గల శ్రీ చైతన్య పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ వైద్యుడు డాక్టర్ సునీల్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు విభిన్న ఆలోచనలతో రకరకాల సైన్స్ ప్రయోగాలు చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థుల ప్రయోగాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డీజీఎం సుధాకర్, ప్రిన్సిపాల్ సతీష్, ఆర్ఐ సుజిత, జోనల్ కో ఆర్డినేటర్ నాగేంద్ర, డీన్ నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

అర్వపల్లి : జాతీయ సైన్స్ దినోత్సవాన్ని అర్వపల్లిలోని మాంటిస్సోరి పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల ఎగ్జిబిట్‌లు ప్రదర్శించారు. అనంతరం ఉపాధ్యాయులు ప్రతిభ చూపినవారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ విపిన్‌కుమార్, ఇన్‌చార్జ్ గిరిజ, హెచ్ఎం అమర్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, రమ, దేవేంద్ర, రజిత, నిఖిత, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలని ఎంఈఓ బోయిని లింగయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీ విద్యా భారతి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో నిర్వహించిన జాతీయ సైన్స్ దినోత్సవంలో పాల్గొని విద్యార్థులు చేసిన ప్రయోగాలను పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పి.మల్లయ్య, డైరెక్టర్లు కోట వెంకట గోపాల్, నజీర్, సైన్స్ ఉపాధ్యాయులు ఉమా, ఉపాధ్యాయులు లింగమూర్తి, అంబటి రమేష్, సురేష్, సరిత, రాధా, అనిత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నాగారం : మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వర్ధమానుకోటలోని జెడ్పీహెచ్ఎస్‌లో హెచ్ఎం బురహానుద్దీన్, పసునూర్ మోడల్‌స్కూల్‌లో ప్రిన్సిపాల్ చంద్రబాబు, నాగారం ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం రాందాస్ నాయక్‌లు సర్ సీవీ రామన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు సైన్స్ ఎగ్జిబిషన్, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించి, ఉత్తమ ప్రదర్శన చేసిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు ఎల్.వెంకటేశ్వర్లు, సిద్ధిరంగాచార్యులు, ఉపాధ్యాయులు పొన్నాల నర్సయ్య, ఎం. రాజు, చిప్పలపల్లి రవి, రమేష్, రఫీ, ప్రవీణ్, డేవిడ్, రాజేష్, వీరేష్, రమేష్, మీనా పాల్గొన్నారు.

భవిష్యత్ అంతా సైన్స్‌దే

పెన్‌పహాడ్ : భవిష్యత్ అంతా సైన్స్‌దేనని, ఆ దిశగా విద్యార్థులు పఠనాశక్తిని పెంపొందించుకోవాలని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ముత్యాల రాజు అన్నారు. శుక్రవారం అనాజీపురం పీఎంశ్రీ ఆదర్శ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో జ్యోతిప్రజ్వలన చేసి సైన్స్ రంగంలో విశేష సేవలందించిన మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు టాలెంట్ టెస్టు, సైన్స్ క్విజ్ నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ నమూనాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కోడి లింగయ్య, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, జయంతి, అంజుమ్, గురుచరణ్, గుర్రాల సోమయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : మూఢ నమ్మకాలను కాకుండా శాస్త్రీయతను, విజ్ఞానాన్ని నమ్మాలని ఎంఈఓ కాట్ల రవికుమార్ అన్నారు. శుక్రవారం జాతీయ సైన్స్ డే సందర్భంగా ముకుందాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తక్కువ సమయంలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుడు రేపాక లింగయ్య, ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మెరుగు రోచిష్ణుకుమార్, ఉప్పు క్రిష్ణయ్య, లింగయ్య, బైరు తిరుమలేష్, కొరివి మధు, అలీమోద్దీన్, తీపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బుస్స వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నూతనకల్ : మండల పరిధిలోని పాఠశాలల్లో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ రాములు నాయక్ మాట్లాడారు. సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం డి.శివయ్య, హరికృష్ణ, ఉమారాణి, చెవగాని వెంకటయ్యగౌడ్, సువర్ణలక్ష్మి, విజయలక్ష్మి పాల్గొన్నారు.



అర్వపల్లి : మాంటిస్సోరి పాఠశాలలో..



మద్దిరాల : ముకుందాపురంలో విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ఎంఈఓ



నూతనకల్ : పెదనెమిలలో సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సూర్యాపేట టౌన్ : రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం జిల్లా కేంద్రంలోని 60 ఫీట్ల రోడ్డులో నివాసముండే కాసర్ల శ్రీనివాసరెడ్డి (50) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే తన కారును గురువారం రాత్రి ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని సర్వీసింగ్ సెంటర్లలో పార్క్ చేసి ద్విచక్రవాహంపై ఇంటికొస్తుండగా తాళ్లగడ్డకు రాగానే పక్క వీధి రోడ్‌లో నుంచి ఒక వ్యక్తి ద్విచక్ర వాహనంపై అతివేగంగా వచ్చి శ్రీనివాస్ రెడ్డి బైక్‌ను ఢీకొట్టాడు. ప్రమాదంలో శ్రీనివాస్ రెడ్డికి తీవ్రంగా పడ్డాడు. కాగా స్థానికులు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ వీర రాఘవులు తెలిపారు.